క్లుప్తంగా

రేపు శ్రీహనుమాన్ గాయత్రి షష్ఠిదశక యజ్ఞం

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ప్రసన్నాంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ గాయత్రి షష్ఠిదశక యజ్ఞం నిర్వహించనున్నట్లు ప్రసన్నాంజనేయస్వామి సేవా సమితి సభ్యులు, గురుస్వామి మహేశ్వరం శివయ్యచారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యజ్ఞానికి మద్దిమడుగు పీఠాధిపతి జయరాం గురుస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఆంజనేయ, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కుతుబుద్దీన్



నియామకపత్రం అందుకుంటున్న మహ్మద్ కుతుబుద్దీన్

మిర్యాలగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జిల్లా అధ్యక్షుడిగా మిర్యాలగూడకు చెందిన మహ్మద్ కుతుబుద్దీన్ ఎన్నికయ్యారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, రాములు గౌడ్, డాక్టర్ అన్సారీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కుతుబుద్దీన్‌తో పాటు కార్యదర్శిగా యారా శ్రీనివాస్, కోశాధికారిగా రవీందర్ తదితరులను ఎన్నుకున్నారు.

వైభవంగా అయ్యప్ప పూజ



అయ్యప్ప పూజలో పాల్గొన్న మాలధారులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని రెడ్డికాలనీలో పులిమేడు ఆశ్రమం ప్రధాన గురుస్వామి దేశిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రమావత్ గిరి–లక్ష్మి దంపతులు ఆదివారం అయ్యప్ప పూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమం గురుస్వాములు గోదాల జానకిరాంరెడ్డి, దేశిడి కిశోర్‌రెడ్డి, యాదిరెడ్డి, తాళ్ల వెంకట్‌రెడ్డి, అనంతసాయి, రంగారావు, రాజా, చిట్ల శ్రీను, శివ కోటి శివ, ఓరుగంటి శివ, నరేష్, నరేంద్రచారి, కొండల్, అభిరామ్, మోక్ష తదితరులున్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన



అస్తిత్వ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి: అస్తిత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్‌వీ కాంప్లెక్స్‌లో ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని చైర్మన్ పంకజ్మల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలో యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి పొందాలనుకునే రైతులకు తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం శ్రీరాములు, ఉప సర్పంచ్ మంగ్యానాయక్, ఎఫ్‌పీఓ మెంబర్ పిల్లి మల్లేశ్, వస్తం రవి తదితరులు పాల్గొన్నారు.

బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్ష్మి

డిండి: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్ష్మీతిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. దేవరకొండను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గాను ఎమ్మెల్యే బాలునాయక్‌కు గిరిజన శాఖ మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ బాలకృష్ణ, కొర్ర నాగరాజు, సుభాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..!

- గుర్రంపోడు మండల కేంద్రంలో బస్టాండ్ లేక ఇబ్బందులు
- కలగానే సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం
- ప్రధాన వీధుల్లో డ్రెయినేజీలు కరువు



బస్టాండ్ లేక రోడ్డుపక్కనే బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

గుర్రంపోడు: మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్, బస్టాండ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే వారు ఆర్టీసీ బస్సులు ఆగినప్పుడు మూత్ర విసర్జనకు ఎక్కడకు వెళ్లాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణనే ఇప్పటి వరకు మూత్రవిసర్జనకు వినియోగించేవారు. ఇటీవల ఆ బంగ్లాకు గేటు నిర్మించడంతో పాటు దాని ఆవరణలో పల్లె పకృతి వనం ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బస్టాండ్ నిర్మాణం చేపడతామని ప్రజాప్రతినిధులు ఎప్పటి నుంచో హామీలు ఇస్తూనే ఉన్నారు. కానీ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ముందు భాగంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వారికి వెనుక వైపు పునరావాసం కల్పించి బస్టాండ్ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఉన్నా అది ముందుకు సాగడం లేదు. బస్సులను తమ ఇష్టం వచ్చిన చోట డ్రైవర్లు ఆపుతుండటంతో ప్రయాణికులు లగేజీలు తీసుకుని పరుగెత్తాల్సి వస్తుంది. దుకాణాల ముందు, రోడ్డుపై ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షించే వారు ఎండలో, వానలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంత రోజున మరిన్ని కష్టాలు

సంత రోజున గ్రామాల నుంచి, వేరే ప్రాంతాల నుంచి తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు టాయ్‌లెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా రోడ్డుపైనే సంతలో కూర్చొనే వ్యాపారులు టాయ్‌లెట్ల కోసం రోడ్డు వెంట చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ సరే.. డ్రెయినేజీ ఏదీ..?

మండల కేంద్రం నుంచి నాంపల్లి రోడ్డులో ప్రధాన రహదారి విస్తరణ జరిగినా ఇరువైపులా డ్రెయినేజీలను నిర్మించలేదు. దీంతో రోడ్డు ఎత్తు పెరిగి ఎగువ భాగంలోని మురుగు, వరద నీరు రోడ్డు పక్కన వీధుల్లో నిలిచి ఇళ్లలోకి చేరే పరిస్థితి ఏర్పడింది. నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలు లేవు. ప్రధాన రహదారుల్లో డ్రెయినేజీలను నిర్మించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. టాయ్‌లెట్ల నిర్మాణానికి మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం బంగ్లా ఆవరణను వినియోగించుకోవచ్చు. మండల అధికారులు, గ్రామ పంచాయతీ ఈ విషయంలో శ్రద్ధ వహించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– రేపాక లక్ష్మీపతి, గుర్రంపోడు

త్వరలో నిర్మిస్తాం



మండల కేంద్రంలోని ప్రధాన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో రూ.5లక్షలు మంజూరయ్యాయి. మరిన్ని నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరాం. నిధులు మంజూరు కాగానే సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం.

– షేక్ మస్రత్, సర్పంచ్, గుర్రంపోడు

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



హౌజింగ్‌బోర్డులో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న అయ్యప్ప, ఆంజనేయ స్వాములు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలను అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రఘువాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి వ్రతాలను నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామున వచ్చి గోదాదేవి అమ్మవారి వ్రతాలను చేశారు. తిరుప్పావై పఠనం నిర్వహించారు. ముందుగా సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూదిని వెంకట్‌రెడ్డి, కన్నెగుండ్ల రంగయ్య, కోశాధికారి కోనేటి శ్రీనివాస్, కార్యనిర్వహణ కార్యదర్శి కాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజారులో..

మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద బజారులో గల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోదాదేవి అమ్మవారికి వ్రతాలు నిర్వహించారు.

రైల్వే స్టేషన్ కాలనీలో..

మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే స్టేషన్ కాలనీలో గల శ్రీసాయిదత్తా ఆశ్రమంలో, శ్రీఅష్టలక్ష్మి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతం, తిరుప్పావై ప్రవచనాలు, అర్చనలు, ఆరగింపు, తీర్థగోష్ఠి, విష్ణుసహస్ర పారాయణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి అజయ్ త్రిపాఠి, ఆలయ కమిటీ నిర్వాహకులు గుండా శ్రీనివాస్, గుడుగుంట్ల నరేందర్, ప్రతాప్, మట్టయ్య, సోమన్న, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



కొండమల్లేపల్లి: అన్నదానం చేసిన దంపతులను సన్మానిస్తున్న మాలధారులు



మిర్యాలగూడ: అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ ఆదర్శ్‌కుమార్

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి చిట్టెడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేసిన వాస స్పందన, శ్రావణ్‌కుమార్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బోడ అశోక్, తోటపల్లి కృష్ణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: పట్టణానికి చెందిన జునైద్ జ్ఞాపకార్థం అతడి స్నేహితులు డాక్టర్ ఆదర్శ్‌కుమార్, పురం వెంకట్, గయాస్, చంటి, నాగేందర్ మిర్యాలగూడ పట్టణంలోని ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం 300 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అమాన్, అమీర్, మునీర్, అక్బర్, గౌస్, ఇమ్రాన్ తదితరులున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



మిర్యాలగూడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్: నోట్‌బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

మిర్యాలగూడ: రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగుల సేవలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలు కూడా పరిగణలోకి తీసుకొని మిర్యాలగూడను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు

మిర్యాలగూడ టౌన్: ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమం నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్, ఆశ్రమంలోని చిన్నారులు ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసేందుకు వచ్చేవారు శాలువాలు, బొకేలకు బదులు నోట్ బుక్స్ తీసుకొని రావాలని ఇటీవల ఎమ్మెల్యే చెప్పగా.. ఈ మేరకు ఆశ్రమంలోని చిన్నారులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి నోట్‌బుక్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి చెందిన చింతమళ్ల ముత్యం అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు పగడాల సైదులు ఆదివారం మృతురాలి కుటుంబానికి మునగాల శ్రీనివాస్, సింగం నాగేశ్వరావు ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మాడుగులపల్లి: వెంకటయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి



తిరుమలగిరి(నాగార్జునసాగర్): పాండురంగారెడ్డిని సన్మానించిన గ్రామస్తులు

మాడుగులపల్లి: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొండేటి వెంకటయ్య పూరి గుడిసె ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైంది. నిత్యావసరాలు, దుస్తులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం: నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటానని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన అనుముల శ్రీనివాస్ కుటుంబానికి ఆదివారం ఆయన రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యడవల్లి దిలీప్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, భరత్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండలంలోని నేతాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీగంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ బాసిరెడ్డి కుమారివెంకట్‌రెడ్డి, బాసిరెడ్డి భార్గవిశ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గ్రామస్తులు దుర్గారెడ్డి, గురునాథం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



మిర్యాలగూడ పట్టణంలోని ఓ కాలనీలో ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు



మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో రోడ్డు పక్కన పడేసిన చెత్త

- కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- మురికికూపాలుగా ఖాళీ ప్లాట్లు
- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు నిలుస్తుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అంటు వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుండగా.. ఆయా వార్డుల్లో ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలుస్తోంది. పలు వార్డుల్లో అంతర్గ రహదారులు సరిగ్గా లేవు. తాగునీటి సరఫరా కూడా సరిగ్గా జరగడం లేదు. మున్సిపాలిటీలో సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేక పారిశుద్ధ్య నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వార్డుకో అధికారిని ప్రభుత్వం నియమించినా వారంతా కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. వార్డుల్లో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఖాళీ స్థలాలతో మరిన్ని ఇబ్బందులు..

ఆయా కాలనీల్లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండటంతో ప్లాట్ల పక్కన వారు ఆ ఖాళీ స్థలాలకు మురుగునీరు మళ్లించడంతో అవి మురుగు కూపాలుగా మారిపోతున్నాయి. మున్సిపాలిటీ అధికారులతో పాటు స్థలాల యాజమానులు కూడా ఖాళీ స్థలాలపై దృష్టి సారించకపోవడంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు



మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్లాట్ల యాజమానులకు ఇప్పటికే నోటీసులను జారీ చేశాం.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ: డిసెంబర్ 26న నిర్వహించనున్న సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలనతో విసుగు చెందిన ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, రమావత్ అంజయ్యానాయక్, పల్లె నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నిడమనూరు: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నిడమనూరు మండల అభివృద్ధికి కృషి చేయాలని, నిడమనూరు మండల కేంద్రం నుంచి నల్లగొండ జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరెడ్డి వెంకట్‌రాహుల్‌రెడ్డి, మేరెడ్డి కృష్ణవివేక్, ఎంపీటీసీ రాణిరమేష్, ఉన్నం చిన వీరయ్య, కుందూరు లక్ష్మారెడ్డి, ప్రభాకర్, శ్రీను, వెంపటి అంజయ్య, ప్రతాప్, కోటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేనావత్ శారద మృతి బాధాకరం



శారద మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: బీఆర్‌ఎస్ నాయకుడు, కర్నాటిపల్లి ఎంపీటీసీ సభ్యుడు నేనావత్ కిషన్‌నాయక్ మాతృమూర్తి నేనావత్ శారద మృతి ఎంతో బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ మండల పరిధిలోని గన్యానాయక్‌తండాలో శారద మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవీంద్రకుమార్ వెంట బీఆర్‌ఎస్ నాయకులు కేతావత్ బీల్యానాయక్, టీవీఎన్ రెడ్డి, ఏర్పుల గోవిందుయాదవ్, మారుపాకుల సురేష్‌గౌడ్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట: మండల పరిధిలోని తెల్దేవర్‌పల్లి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న మహాలక్ష్మమ్మ జాతరలో ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతిచందునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు బుజ్జిలచ్చిరాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, కేతావత్ లక్ష్మానాయక్, జైపాల్‌రెడ్డి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ-జడ్చర్ల హైవేపై దుర్గంధం

- రైస్ మిల్లు నుంచి వెలువడుతున్న మురుగు నీటితో దుర్వాసన



రైస్ మిల్లు నుంచి వెలువడిన మురుగు నీటితో ఏర్పడిన కుంట

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల సాయి వెంకటేశ్వర పారాబాయిల్డ్ రైస్ మిల్లు నుంచి విడుదలవుతున్న మురుగునీటితో కోదాడ-జడ్చర్ల 167వ జాతీయ రహదారిపై తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రైస్ మిల్లు నిర్వాహకులు మిల్లు నుంచి విడుదలయ్యే నీటిని జాతీయ రహదారి పక్కకే వదులుతుండడంతో కుంటను తలపిస్తోంది. చాలా రోజులుగా ఈ నీరు ఒకేచోట నిల్వ ఉండడంతో జాతీయ రహదారి పక్కన దుర్గంధం వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇదే విషయమై చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సరస్వతిని వివరణ కోరగా.. త్వరలో రైస్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడి మిల్లు నుంచి నీటి విడుదల కాకుండా చూస్తామని, ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని బకల్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులు రామ్మూర్తి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అబ్దుల్ ఘని, చాపల శ్రీనివాస్, వీరయ్య, పద్మజ, రహీంను సత్కరించారు. కార్యక్రమంలో లీగల్ లిటరసీ క్లబ్ ఇన్‌చార్జి కస్తూరి ప్రభాకర్, శశికళ, స్వప్న, హేమ, ప్రియాంక, గౌర్మత్ కౌర్, పరమేశ్వరీ, షహనాజ్ తదితరులున్నారు.